

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**జుట్టుని నెమరుతూ** వెనక రబ్బర్ బాండ్ పెడితే ఎలా ఉంటుంది? పక్కన పిన్ పెడితే ఎలా ఉంటుంది? పక్క పాపిడి తీస్తే ఎలా ఉంటుంది? అని అద్దంలో చూస్తూ ఎంతసేపు గడిపానో తెలీదు కానీ

"ఒసేయ్. అద్దం పగిలిపోతుందింక. వచ్చి తిను" అన్నయ్య కేకేసాడు.

"ఆకలేయట్లేదు"

"పర్లేదు. అయినంత వరకు వచ్చితిను. నువ్వు తింటే నేను టేబుల్ సర్దుతాను. లేకపోతే సాయంత్రం చిరుతిండి తిని రాత్రికి భోం చేయవు"

వెంటనే అమ్మ గుర్తొచ్చి ఒక్కసారిగా కళ్ళంతా తడయ్యాయి. దిగులుగా సోఫాలో కూలిపోయాను. అది చూసి కంగారు పడుతూ "ఏమైంది? ఏమైనా దెబ్బ తగిలిందా?" అంటూ అన్నయ్య నా పక్కకి చేరాడు. "అమ్మ గుర్తొచ్చింది" వెక్కివెక్కి ఏడ్చాను.

"హోం సిక్‌నెస్ ఓన్లీ కొన్ని రోజులే ఉంటుంది. అమ్మ రాత్రికి ఫోన్ చేస్తానందిగా, అప్పుడు మాట్లాడితే కాస్త తగ్గుతుంది. ఇప్పుడు ఏడవకు" నేను ఏడుపు ఆపకపోవడంతో,

"నువ్వు ఇప్పుడే ఇంత దిగులు పడితే ఇండియనాకి వెళ్ళాక ఇంకా కష్టమౌతుంది. నిన్ను నువ్వు డిస్ట్రాక్ట్ చేసుకో" అన్నా ఏడుపు ఆగలేదు.

"సర్లే ఒకమంచి జంధ్యాల సినిమా చూద్దాం" టీవి ఆన్ చేసాడు. అన్నయ్య చెప్పినట్టే చూస్తూ చూస్తూ దిగులు మర్చిపోయి నవ్వాను. అన్నయ్య వాడే తెలుగు పదాలు, సామెతలు ఎక్కడనించి వస్తున్నాయో అర్ధమయ్యింది. సినిమా పూర్తయ్యాక "వైఫై పాస్‌వర్డ్ చెప్తా కనెక్ట్ అవ్వు" అన్నాడు.

"దేనికి?"

"ఈ లెక్కన నువ్వు మాస్టర్స్ పాసైనట్టే. పొద్దునే కదా ఫోన్ కొన్నాం అప్పుడే మర్చిపోయావా?"

"ఓ.. సారీ. సడెన్‌గా స్ట్రైక్ కాలేదు"

"సర్లే. ఫోన్ తీసుకునిరా. సెటప్ చేద్దాం"

ఫోన్ అన్నయ్య చేతికిచ్చి, డబ్బాలోంచి లేప్‌టాప్‌ని బయటికి తీసాను.

"నీకు ఆపిల్ అకౌంట్ ఉందా?"

"లేదు"

"సరే. నాది వాడుకో" తన ఐడితో లాగిన్ అయ్యాడు.

"యూ ట్యూబ్, షజామ్, నెట్‌ఫ్లిక్స్, ఫేస్‌బుక్, కిండిల్ డౌన్‌లోడ్ చేస్తున్నా. నెట్‌ఫ్లిక్స్‌కి నా అకౌంట్ వాడుకో" అన్నాడు.

"షజామ్ అంటే?"

"మ్యూజిక్ కి సంబంధించింది" ఎలా వాడాలో తన ఫోన్‌లో చూపించాడు.

"కిండిల్ అవసరంలేదు"

"ఎందుకు?" మహాపాపం చేసినట్టు చూసాడు.

"నేను బుక్స్ చదవను"

"అలవాటు చేసుకో"

"కాలేజ్ స్టార్ట్ అయ్యాక ఎలా అయినా టైం ఉండదు."

"నెట్‌ఫ్లిక్స్‌కి, యూ ట్యూబ్‌కి టైం ఉంటుంది కానీ బుక్స్‌కి ఉండదా?" వ్యంగ్యంగా అడిగాడు.

తలదించుకుని ఏం సమాధానం చెప్పలేదు.

"టెక్స్ట్ బుక్ నాలెడ్జ్ ఒక్కటి సరిపోదు" అరగంటపాటు నాకు జ్ఞానం దానం చేస్తున్నా అనుకుంటూ క్లాస్ పీకాడు.

ఇంకో మాటంటే తిడతాడేమో అని భయమేసి "చదవడం మొదలుపెడతాను" అన్నాను.

"ఇప్పుడే వస్తా" అని ఫోన్ నా చేతిలో పెట్టి వెళ్ళాడు. ఫేస్‌బుక్ లాగిన్ టైప్ చేసే లోపు ఒక పుస్తకం పట్టుకుని వచ్చాడు.

''ఈ బుక్‌తో స్టార్ట్ చెయ్యి చదవడం. ఇది మంచి బుక్'' నా చేతికిస్తూ అన్నాడు. అది తెరవగానే నేను ఆవులించడం చూసి ''అది సిడ్నీషెల్డన్ రాసిన ఫస్ట్ బుక్. తను నా ఫేవరెట్ రైటర్. చదువు'' అన్నాడు.

''లవ్ స్టోరీనా?''

''కాదు. అది థ్రిల్లర్.''

''థ్రిల్లరా?'' నిరుత్సాహపడ్డాను.

''ఒక ట్వెంటీ పేజీలు చదువు. ఆ తరవాత నచ్చకపోతే మానెయ్''

''సరే. రాత్రి మొదలు పెడతా''

''రాత్రికి ముహూర్తం బావుందా? ఇప్పుడు ఖాళీనేగా?''

తిట్టుకుంటూ బుక్ తెరిచాను. మొదటి పేరా వేగంగా అయిపోయింది. కానీ రెండో పేరా చదివే ముందు పేజీలు తిప్పి చూసాను. ఇరవై పేజీలంటే రెండు రోజులు, నాలుగు కునుకులు పట్టేట్టుంది.

అసలు నేను ఇది చదవక పోతే వచ్చే నష్టమేంటట? హాయిగా టీవీ చూసుకుంటూ కాలక్షేపం చేసేదాన్ని కదా అనుకుంటుండగా ''అన్ని టెక్స్ట్ బుక్స్ చదివావు, ట్వెంటీ పేజీలు చదవడం నీకు లెక్కా? నేను నీ లేప్‌టాప్ సెటప్ చేస్తాను. ఈలోపే అయిపోతుంది. నువ్వు ఫాస్ట్ రీడర్ అని నాకు తెలుసు'' అన్నాడు.

''ఔను. నేను చాలా ఫాస్ట్‌గా చదివేస్తాను'' అని నిరూపించుకోడానికి తిరిగి చదవడం మొదలుపెట్టాను. మొదట్లోనే ఒక హత్య. దీని బదులు రామ్ గోపాల్ వర్మ సినిమా చూపిస్తే అయిపోయేది కదా అనుకుంటూ పేజీ తిప్పాను. ఒకరి తరువాత ఒకరు కొత్త కేరక్టర్లు పరిచయమయ్యారు. వారిలో సగం రకరకాల మానసిక రోగాలున్న పేషెంట్స్. నేను అనుకున్నట్లుగా గజిబిజి గందరగోళంలా కాక ఎంతో ఆసక్తిగా ఉంది. సిడ్ని షెల్డన్ వర్ణన బట్టి నేను డాక్టర్ జడ్ స్టీవెన్స్ ఆరడుగుల ఎత్తు, చామనఛాయ, నున్నగా దువ్విన జుట్టుతో ఊహించుకున్నాను. ఆన్‌బ్లేక్ ఎంతో అందంగా, హుందాగా ఉంది. డాక్టర్ ఆఫీసు ఎంతో కళాత్మకంగా ఊహించుకున్నాను. పోలీసులు చేజ్ చేసిన రోడ్డు పక్కన చిన్నలోయ, ఆన్ వేసుకున్న పసుపచ్చ రంగు డ్రెస్సు, కేరల్ పెట్టుకున్న ఎర్రటోపి ప్రతీదీ సిడ్నీ షెల్డన్ వర్ణన బట్టి నేను ఊహించుకున్నదే సినిమాల్లోలా ఎక్కువ లేక తక్కువ నటన కాక ప్రతిపాత్ర నిజజీవితంలో వ్యక్తుల్లా నా కళ్ళముందు మెదిలారు. మొదట్లో చదవడం కష్టమైనా, చదువుతూ పోతే పుస్తకం పక్కన పెట్టలేకపోయాను. ఏన్‌డ్రూ మెక్‌గ్రీవా శవాన్ని పోలీసులు విచారిస్తుండగా, ''చదువుతున్నావా? నిద్రపోయావా?'' అన్నయ్య వెటకారంగా అడిగాడు.

''చదువుతున్నాను.''

''ఇంకా 20 పేజీలు అవ్వలేదా?''

''36 పేజ్‌లో ఉన్నాను'' చూసి చెప్పాను.

''అదేంటి? బోర్ అన్నావు? ప్రైం మినిస్టర్‌లా బిజీ అన్నావు? 35 పేజీలు చదివేసావా?''

''యా. డిస్టర్బ్ చెయ్యకన్నయ్య. ఇంట్రెస్టింగ్‌గా ఉంది'' మళ్ళీ బుక్‌లో పడ్డాను. కొన్ని నిముషాలకి ''నేను వాకింగ్‌కి వెళ్తున్నా. వస్తావా?'' అడిగాడు అన్నయ్య.

''లేదు. బుక్ సగంలో ఉన్నా. నువ్వెళ్ళు'' బదులిచ్చాను.

ఆ తరువాత అన్నయ్య తిరిగి ఇంటికి ఎంతసేపటికి వచ్చాడో, ఎన్ని పనులు చేసాడో తెలియదు.

"తిన్నావా?" అడిగాడు అన్నయ్య.

"లేదు"

"ముందు లేచి తిను. టైం ఎంతో తెలుసా?"

"ఆకలేయట్లేదు"

"పర్లేదు. అయినంతవరకు తిను" కోపడ్డాడు.

"సరే" అని కంచం తెచ్చి కూర్చున్నాను. బుక్ పట్టుకుని ఏం తిన్నానో, ఎంత తిన్నానో కూడా గమనించలేదు. తిరిగి సోఫాలో చేరాను. అన్నయ్య టీవీ ఆన్ చేసి సినిమా పెట్టడం తెలుసుకానీ ఆ డైలాగులు నా చెవిన పడలేదు. సినిమా పూర్తయి శుభం కార్డు పడ్డంకూడా గమనించలేదు.

"రేపు ఎక్జామ్ లేదు" అన్నయ్య అన్నాడు.

"తెలుసు. కానీ ఆపాలని లేదు"

"ఎన్ని పేజీలు మిగిలాయి?"

కాగితాలు తిప్పి "43" ఆశ్చర్యపోతూ బుదులిచ్చాను.

"సరే. ఫాస్ట్‌గా ఫినిష్ చేసి స్నానం చెయ్యి"

చదవడం పూర్తయ్యాక ఆఖరి పేజీ చూసినప్పుడు ఒక తెలియని బాధ కలిగింది. అమ్మమ్మని వదిలిపెట్టి మా ఊరికి తిరిగి వెళ్ళినప్పుడు కలిగిన దిగులు వచ్చింది. ఏడుస్తానేమో అనిపించగా "ఎలా వుంది?" అన్నయ్య అడిగాడు.

"చా..లా..బావుంది"

"మరి అంత దిగులుగా ఉన్నావేంటి? క్లైమాక్స్ నచ్చలేదా?"

"నచ్చింది కానీ బెంగగా అనిపిస్తుంది"

పెద్దగా నవ్వి "బుక్ హేంగ్ ఓవరా?" అడిగాడు. "అంటే?"

"బుక్‌లో కేరక్టర్స్ మీద దిగులు. జీవితంలో ఒక భాగాన్ని కోల్పోయిన బాధ, ఇంకో పుస్తకం తెరవలేకపోవడం బుక్ ఫినిష్ అయినందుకు సేడ్‌గా అనిపించడం"

"అచ్చు అలానే ఉంది" దీనికి పేరుందని అప్పటివరకు నాకు తెలియదు.

"ఇంతకీ ఏం నచ్చింది నవలలో?"

"డాక్టర్ కేరెక్టర్ నచ్చింది. ఎంతో పేషెంట్‌గా వ్యవహరించాడు. నేనైతే ఏడ్చేసేదాన్ని. లాస్ట్‌లో ట్విస్ట్ సూపర్ ఉంది. నేనసలు ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు."

"ఎంజాయ్ చేసావన్నమాట?"

"చాలా. బెస్ట్ ఎక్స్‌పీరియెన్స్ అన్నయ్యా. బుక్స్ ఇంత బావుంటాయని నాకు తెలియదు. చాలా బోరింగ్ ఉంటాయనుకున్నాను."

"ఎంచుకున్న బుక్‌ని బట్టి ఉంటుంది. బోరింగ్ బుక్ తెరిస్తే బోరే కొడుతుంది. రైటర్ బట్టి సెలెక్ట్ చేసుకోవాలి, లేదా జానర్ బట్టి"

"అన్నయ్యా నాకు నేర్పిస్తావా? ఎలా సెలెక్ట్ చేసుకోవాలో?"

"అదేం బ్రహ్మ విద్య కాదే. ఎవరికి వాళ్ళే నేర్చుకోవాలి"

నేను చిన్నబోవడం గమనించి "నీకు నచ్చిన సబ్జెక్ట్, నచ్చిన రైటర్స్‌వి చదువు" అన్నాడు.

"అబ్బా, ప్లీజ్. నేను చదివింది అదొక్కటే బుక్ అన్నయ్యా. నాకు థ్రిల్లర్స్, లవ్ స్టోరీస్ తప్ప వేరే ఎన్ని రకాలుంటాయో కూడా తెలీదు. సిడ్నీ షెల్డన్ పేరు కూడా ఇవాళే విన్నాను. నా ఫ్రెండ్స్ చేతన్ భగత్ బుక్సే చదువుతారు కానీ నాకు అవి నిద్రొస్తాయి. అందరూ ఆ నవలలని పొగిడితే అవే అద్భుతం అనుకున్నాను. అంతకన్నా వెయ్యిరెట్లు బావుంది ఇది. నీ హెల్ప్ కావాలన్నయ్యా"

"నాకూ చేతన్ భగత్ బుక్స్ అంత నచ్చలేదు. నా దగ్గర ఓన్లీ థ్రిల్లర్స్, బయోగ్రఫీస్, పొయెట్రీకి సంబంధించినవే ఉన్నాయి. నీకు నచ్చే లవ్ స్టోరీస్ నాకు బోరింగ్. ఓ పని చేద్దాం. రేపు నేను ఆఫీస్ నుంచి వచ్చే టైంకి నీకు మెసేజ్ చేస్తా. నువ్వు రెడీగా ఉండు. లైబ్రరీకి వెళ్ళి కొన్ని బుక్స్ తెచ్చుకుందాం."

"బయోగ్రఫీస్ నీకు బోర్ కొట్టవా?"

"మనిషిని బట్టి ఉంటుంది. గొప్ప వ్యక్తి బయోగ్రఫీ గొప్పగానే ఉంటుంది."

"అంటే?"

"భగత్ సింగ్ రాసినవి, గరిబాల్డీ, బిస్మార్క్, చాణక్య, లియో టాల్ స్టాయ్, వాళ్ళవి బావుంటాయి. ఎవరైనా ఎడ్వెంచర్స్, లేదా ఎక్జైటింగ్ లైఫ్. ప్రజలని ఇన్‌ఫ్లుయెన్స్ చెయ్యని వారు, first world ప్రాబ్లమ్స్ గురించి రాసినవి నాకు చిరాకు."

"ఓ" ఇంకేమైనా చెప్తాడేమో అని ఓ రెండు నిమిషాలు ఆగాను.

"రేపు నువ్వు ఆఫీస్‌కి వెళ్ళినప్పుడు నేను చదవడానికి ఇంకో బుక్ ఇవ్వవా?" అడిగాను.

"అతి వృష్టి, అనావృష్టిలా చెయ్యకు. ఒక రోజులో బుక్ ఫినిష్ చెయ్యాలని కంకణం కట్టుకుని కూర్చోకు. నెమ్మదిగా చదవడం అలవాటు చేసుకో. మొదటిసారి కాబట్టి నువ్వు ఎంతసేపు చదివినా ఆపలేదు. కానీ ఇలా పట్టువదలని విక్రమార్కుడిలా చదవడం కరెక్ట్ కాదు. మిగిలిన పనులు కూడా చేసుకోవాలి. ఒకరోజంతా కూర్చుని తిండి, తిప్పలు మానేయడానికి నీకేం ఎక్జాం లేదు. ఎంటర్‌టైన్ మెంటుని ఎంటర్‌టైన్‌మెంట్‌లానే ఉంచాలి. టైం మేనేజ్ మెంట్ నేర్చుకో."

"సరే" తలూపాను.

"స్నానం చేసిరా. డిన్నర్ రెడీ చేస్తా. ఇవాళ తొందరగా పడుకోవాలి. రేపు నేను పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళాలి"

అన్నయ్యని విసిగించకుండా తను చెప్పినట్టే చేసి పదింటిలోపు మంచమెక్కాను కళ్ళు మూసుకున్న వెంటనే నిద్రలోకి జారిపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story